

# భవానీద్వీపం

## - వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 44 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

వర్షపు తెరల చాటున సుదర్శనాచార్యులు మాయమయ్యాడో లేదో విచిత్రమైన ఆకారం ప్రత్యక్షమైంది. సుదర్శనాచార్యులు తన బాధామయమైన స్థితిలో గమనింపలేదో, దట్టమైన వర్షపు పరదాల మాటున ఆ వ్యక్తి కనబడలేదో తెలియదు.

పూర్తిగా తలెత్తి చూడాల్సినంత ఎత్తు. ఆజానుబాహుడు. గోధుమరంగు నొక్కుల జుత్తు వెనుక వీపుమీదకు, గడ్డంతో కలిసిపోయి ముందుకు, ఛాతీ మీదకు పడుతున్నది. ఎవరు పెడతారో, ఎప్పుడు తింటాడో, ఏమి తింటాడో, ఎక్కడ తింటాడో తెలియని బైరాగి, కానీ జంకు కలిగించే భారీ విగ్రహం.

చివరన అదిమినట్టున్న పెద్ద ముక్కు. పెద్ద పెద్ద నాసికారంధ్రాలు. ముళ్ళలా దట్టమైన గోధుమరంగు కనుబొమ్మలు. తీక్ష్ణమైన మెరుపుల్లాంటి చూపులు. ముదురు బంగారురంగు కనుగుడ్లు. విశాలమైన నోరు. హోమగుండంలో నేయిపోసే పెద్దపెద్ద కట్టె గరిటెలలాంటి వెడల్పాటి అరచేతులు. అరచేతులు తప్ప ఒళ్లంతా ముళ్ళలాంటి గోధుమరంగు రోమాలు. ఎవరికైనా ఏదో తెలియని జంకు కలిగించే విగ్రహం.

ఎర్రటి చిరుగుల ఉత్తరీయము విల్లులాంటి భుజాలమీద వేళ్ళాడుతున్నది. ఎర్రటి చిరుగుల పట్టుబట్ట కట్టుకున్నాడు. ఒక చేతిలో పెద్ద తంబుర, రెండో చేతిలో పెద్ద చిడతలు. కొండచరియలాంటి విశాలమైన ఎదుర్రొమ్ము మీద మెలికలు పడ్డ అడవితీగల్లా తామరపూసల మాలలు. తంబుర శృతి పంచుతూనే వున్నది. చిడతలు మోగుతూనే వున్నాయి. ఆ ఆకారం మీద పడుతున్న వర్షపు చిందులు బంగారు మెరుపులు మెరిపిస్తూ రాలిపోతున్నాయి.

'టక్కు టక్కూ.. టిక్కు టిక్కూ' అని లయబద్ధంగా పాడుతూనే పరుగులాంటి నడకతో ముందుకు దూకాడు. అంతదూరంనుండీ నాలుగు అంగల్లో పాడుబడ్డబావి దగ్గరకు చేరుకున్నాడు. 'టక్కు టక్కూ.. టిక్కు టిక్కూ' అని పాడుతూనే లోపలికి చూశాడు. వెంటనే 'హహహా' అని పెద్దగా నవ్వాడు. బావిలోపలికి తొంగిచూస్తూ 'కువ్వా..కువ్వా' అన్నాడు పసిపిల్లల ఏడుపును అనుకరిస్తున్నట్లు. రెండుక్షణాలు అలా వినోదిస్తూనే వున్నాడు మొండిగోడ చుట్టూ చిన్నగా గంతులేస్తూ.

యిప్పుడు వర్షం పూర్తిగా తగ్గిపోయింది. అంతలోనే పడమటి ఆకాశం పూర్తిగా స్వచ్ఛంగా దర్శనమిచ్చింది. బంగారు రంగులో మెరిసిపోతూ సూర్యుడు బయటకొచ్చాడు. భీతావహంగా వున్నది పాడుబడ్డబావి. కొన్ని దశాబ్దాలక్రితంవరకూ సంతూరు చుట్టుపక్కల ఊళ్లకు కూడా దాహం తీర్చిన బావి. అయిదు ధనువుల పొడుగు, మూడు ధనువుల వెడల్పు యాభై ధనువుల లోతు వున్నబావి అది.

దట్టంగా వల అల్లుకున్నట్టు బావి అడుగునుండి పైకి పాకి నాలుగుమూలలకూ బలంగా అల్లుకుని వున్నది తిప్పతీగ. తిప్పతీగమీద వుయ్యాలలూగుతున్నాడు కన్నతండ్రి విసిరేసిన పసిగుడ్డు. వాడిని విసిరిన వూపుకు తిప్పతీగ నెమ్మదిగా వుయ్యాల వూగుతూనే వున్నది యింకా. వూగుతున్న తీగ నుండి వర్షపు బిందువులు జల్లులు కురిపిస్తున్నాయి వెనక్కూ ముందుకూ. అంతవరకూ వాడి వొంటిని మెత్తగా చుట్టుకున్న సిందూరం రంగు పట్టుబట్ట అంచులు తలలు ఎగరేస్తున్నాయి. పరమాత్ముడి కరుణ జయించిందని జెండాలు ఎగరేస్తున్నట్టు ఎగురుతున్నాయి.

'కువ్వా .. కువ్వా' అన్న ధ్వని వెలువడడమే ఆలస్యం! జాలిగా 'వువ్వా..వువ్వా..' అని రోదించాడు శిశువు. వాడు తన దీనగాథను చెబుతున్నట్టు వున్నది ఆ ఏడుపు. తంబురను, చిడతలను కూలగా మిగిలిన మొండిగోడమీద పెట్టాడు ఆ వ్యక్తి. దూకుతున్నట్టుగా బావి నాలుగుమూలలను ప్రదక్షిణగా చుట్టాడు. వరసగా నాలుగుమూలల తీగను దృఢమైన బాహువులతో ఒక్క దగ్గరకు మూటలా లాగాడు. తిప్పతీగతో చేసిన వలలో బుల్లి చేపలా వున్నాడు పసివాడు. బావి గోడకు, అంచులకు తగలకుండా జాగ్రత్తగా తీగను పైకి చేదుకున్నాడు, ప్రహ్లాదుడిని నృసింహమూర్తి చేదుకున్నట్టు.

ముత్యపుచిప్పలోనుంచి చిన్ని ముత్యాన్ని తీసినట్టు జాగ్రత్తగా బాలుడిని బయటకు తీశాడు. వాడిని చుట్టిన పొడవైన వస్త్రాన్ని తనభుజానికి చుట్టి కొసలు ముడేశాడు. వుయ్యాలలాగా జోలె తయారైంది. కువ్వా..కువ్వా అని శిశువు మొహంలోకి చూసి నవ్వాడు 'బయలుదేరుదామా' అని అడిగినట్టు. ఒకే ఒక లిప్తపాటు వాడి గులాబీరంగు పెదవులు చిన్నగా విచ్చుకున్నట్టు సన్నగా నవ్వాడు. మళ్ళీ 'వువ్వా వువ్వా' అని ఏడ్చాడు. పిల్లాడిని జోలెలో వేసుకున్నాడు. తంబుర చిడతలు అందుకున్నాడు. తాళం, పాట అందుకున్నాడు. 'టక్కు టక్కు .. టిక్కు టిక్కు' అంటూ.

టక్కు టక్కు టిక్కు టిక్కు టక్కరి బండి
టక్కరోడి బండి దీని తంతు చూడరండి
ఎంతెంత దూరం కోసెడుంది దూరం
యింకెంత దూరం యింక కోసు దూరం

తియ్యని గంభీరమైన గొంతుతో పాడుతూ ముందుకు కదిలాడు. జోరున కురిసిన వర్షానికి నాని వున్నది దారి. ఆ భారీకాయుడు అడుగులేస్తుంటే గజంలోతు గుంటలు పడుతున్నాయి. నాట్యంలో కదలికలలాగా వున్నాయి జారుతున్న అడుగులు. గుడిముందునుండి, సుదర్శనాచార్యుల యింటిముందునుండి నడిచాడు. ఆ గొంతునుండి ఆ మార్మిక తత్త్వ గీతం వెలువడుతూనే వున్నది.

ఏమిటింత దూరం ఏమిటింత భారం
ఏమి వింత పుంత లింత వేదభావ సారం
బండి తోలువాడు జగమొండి బుద్ధి దేవుడు
బండినెక్కువాడు వాడి అండజిక్కు జీవుడు
టిక్కు టక్కు టిక్కు టక్కు తిక్కల బండి
తిప్పులాడి బండి దీని తీరు చూడరండి

ప్రహరీగోడ ముందునుండి గాలి అలలకు తేలి తేలి వస్తున్న గొంతు వినబడగానే సుదర్శనచార్యుల ఒళ్ళు ఎందుకో ఝల్లుమన్నది. చెంగున పైకిలేచాడు. వసారా దూలం పట్టుకుని పైకి నిగిడి చూశాడు.

గండగొండి మొండిబుద్ధి బండి తోలునండీ
మొక్కి బండినెక్కి బాటసారి సాగునండీ
యింద్రియాల దశకమంట గుర్రాలవి కళ్ళెవంట
మనసు యిక్కడక్కడాగి నిక్కి నిక్కి చూడకుండ

ప్రహరీ ముందుగా తేలుతూ పోతున్న గొంతు వినిపిస్తున్నది. చెట్లు, పొదల మధ్యనుండి మూలమలుపు తిరుగుతున్న ఆజానుబాహువు ఆకారం కనిపించింది.పైకి లేచిన ఒక చేతిలో తంబుర కనిపించింది. యింకొక చేతిలో పెద్ద చిడతలు కనిపించాయి. నడుముకు వేళ్ళాడుతున్న సిందూరం రంగు జోలె కనిపించింది. జోలె లోనుండి కుదుపులకు ఎగురుతున్న రెండు లేత పాదాలు కనిపించాయి. గాలికి వూగుతున్న రెండు మందారపూలలాగా వున్నాయి ఆ పాదాలు. నిలువెల్లా ఝల్లున వణికిపోయాడు సుదర్శనాచార్యులు. ఘడియ క్రితం తను పొత్తిళ్ళలో చుట్టిన సిందూరం రంగు వస్త్రం అది. అర్ధమైంది సుదర్శనాచార్యులకు.

ఒక్కగంతున దూకి పరుగున ప్రహరీ ద్వారాన్ని దాటాడు. వాకిలి అంతా గండ్రయిసుక, ఎర్రమన్ను వున్నది వర్షాకాలంలో జారకుండా. కనుక ఆ దూకుడుకు ఏ ప్రమాదమూ జరగలేదు. తలుపులు తెరుచుకుని బయటకు దూకినవాడు దూకినట్టే బురదలో తలకిందులైనాడు. తేరుకుని చేతులమోపుమీద వేగంగా లేవబోయి మరలా జారి బోర్లపడిపోయాడు. ఎందుకో తెలియని దుఃఖం వరదలాగా తన్నుకొస్తున్నది. కన్నీరు బురదనీటితో కలిసి చాతీమీదికి కారిపోతున్నది. ఆ ఆకారం కనబడకున్నా అంతకంతకూ దూరమౌతున్న గొంతు గాలివాలుకు వినిపిస్తూనే వున్నది.

ఎప్పు డెప్పు డెక్క డెక్క డెట్లు సాగుచుండునో
ఎవని పయనమర్థవంత మౌచు సాగుచుండునో
అందమైన పయనమంతలోనే ఆగుచుండునో
ఎవ్వడంట తెలిసినోడు? వెలుతురింట వెలిసినోడు

జారుతూ పడుతూలేస్తూ పిచ్చివాడిలా ఆ గొంతువెనుకే పరుగెత్తాడు సుదర్శనాచార్యులు. నెమ్మదిగా గాలిలో కరిగిపోయినట్టు ఆ గొంతు వినిపించడం ఆగిపోయింది. చిన్నజల్లుగా మొదలై జోరున వర్షంకురవడం మొదలైంది.

వర్షపు పరదాల చాటున స్పష్టంగా కనిపించకుండా పోయింది. దాదాపు పొలిమేరల్లోకి వచ్చినట్టు గ్రహించాడు సుదర్శనాచార్యులు. అలాగే నిలువెల్లా తడిసిపోతూ ఎంతసేపు వున్నాడో తనకే తెలియదు. వర్షం నెమ్మదించి చిరు జల్లుగా మారింది. నిశ్చేష్టుడైనాడు. నెమ్మదిగా వెనకకు తిరిగాడు. దూరంగా గుడి గోపురం లీలగా కనిపించింది. రెండుచేతులూ పైకెత్తి బిగ్గరగా 'నరసింహా' అని గావుకేక పెట్టాడు. నిలువెల్లా వణికిపోతూ బిగ్గరగా రోదించడం మొదలుబెట్టాడు. చాలాసేపటికి కన్నీరు అయిపోయిందేమో, మౌనంగా తూలుతున్నట్లు అడుగులు ముందుకేశాడు.

ఎలా ఇల్లు చేరుకున్నాడో తెలియదు. నిలువునా పరుచుకున్నట్టు పడిపోయాడు. సగం స్పృహలో సగం మగతలో వుండిపోయాడు. ఆలోచనలు మాత్రం ఆగలేదు. యింతటికీ ఆ ఆజానుబాహువే, ఆ బైరాగే కారణం అని చటుక్కున మెరుపులా మెరిసింది.

సంతూరులో మొదటిసారి ఆ ఆకారం దాదాపు సంవత్సరం క్రితం ప్రత్యక్షమైంది. అప్పుడు సుదర్శనచార్యుల తండ్రి శఠగోపాచార్యులు ఆ బైరాగిని యింటికి పిలిచాడు. భోజనం పెట్టించాడు. అతడొక ముక్తపురుషుడని గ్రహించాడు శఠగోపాచార్యులు.

ఎన్ని అడిగినా యిష్టమైతేనే రెండుమూడు ముక్కల్లో సమాధానం చెబుతాడు. అంతే. ఒకోసారి అడిగినా అడగకున్నా ఉరుములు ఉరిమినట్టు తనంత తనే యేవో చెబుతాడు. తన వివరాలు యేవి అడిగినా మౌనమే సమాధానం. ముగ్గురు మనుషుల అన్నం తిన్నాడు. వెళ్ళబోతూ వెనుకకు తిరిగాడు. తంబురా, చిడతలతోనే రెండు చేతులూ పైకి ఆశీర్వదిస్తున్నట్టుగా ఎత్తి 'మహాయోగి పుడతాడు. వంశం తరిస్తుంది. నారసింహుడి అవతారమే!' అని వెళ్ళిపోయాడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)